క్లుప్తంగా

హెచ్‌ఏఎల్ టీఈఏ అధ్యక్షుడిగా చిలుక రాందాస్



బాలానగర్: హెచ్‌ఏఎల్ తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ) అధ్యక్షుడిగా చిలుక రాందాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ అధ్యక్షుడు అజయ్‌కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. పాత కార్యవర్గాన్ని రద్దు చేసి, కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హెచ్‌ఏఎల్‌టీ అధ్యక్షుడిగా చిలుక రాందాస్ పేరును అజయ్‌కుమార్ ముదిరాజ్ ప్రతిపాదించారు. మాజీ ప్రధాన కార్యదర్శి మహేష్‌గౌడ్ బలపరిచారు. మిగతా కార్యవర్గ సభ్యులు ఆమోదం తెలుపడంతో అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. అనంతరం ప్రధాన కార్యదర్శిగా క్రాంతికుమార్, కోశాధికారిగా సంతోష్‌కుమార్ సైతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వైభవంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగానగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం పూజలు చేశారు. మహా కుంభస్థానం, అగ్ని ప్రతిష్ఠ హోమం, ధ్వజారోహణం, పూర్ణాహుతి, నివేదన, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, బాలగోపాలం, యాగశాల, ధ్వజతోరణం, కుంభారాధనం నిర్వహించారు. ప్రతిరోజు ఆలయంలో దేవుడిని దర్శించుకుంటే శుభం కలుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి జీఏకే కృష్ణ పేర్కొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేస్తాం



దయార్‌గూడలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు బస్తీ, కాలనీల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తున్నామని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని దయార్‌గూడలో రూ.19 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంతోష్, దయార్‌గూడ అధ్యక్షుడు శంకర్, సురేష్, నాగరాజు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



మల్లేష్‌గుప్తా కుటుంబీకులను పరామర్శిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

మోతీనగర్: బీజేపీ సెంట్రల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లేష్‌గుప్తా మాతృమూర్తి ఇటీవల పరమపదించారు. అవంతినగర్‌లోని ఆయన నివాసానికి గురువారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో మూసాపేట కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్, మాజీ వార్డు కమిటీ సభ్యురాలు కె. శ్రీలత, నాయకులు ఎర్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

మూసాపేట: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాలు శుక్రవారం ఉదయం 7.30 గంటలకు బాలాజీనగర్ కార్పొరేటర్ కార్యాలయం వద్ద, ఉదయం 8.30 గంటలకు బాలాజీనగర్ విజయదుర్గ సెంటర్ వద్ద బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అసోసియేషన్ సభ్యులు,మహిళలు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ ఓ ప్రకటనలతో తెలిపారు.

వివాహానికి ఆర్థిక సాయం

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్‌లో నివాసముంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన హుస్సేనప్ప, లక్ష్మీ ప్రియ దంపతుల కుమార్తె శశికళ వివాహానికి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నోళ్ల శ్రీనివాస్, పోశెట్టి గౌడ్, అశోక్, వెంకటేష్, సాయిగౌడ్ పాల్గొనారు.



ప్రమాదకరంగా చెట్లు



బాలాజీ స్వర్ణపురి కాలనీలో కర్ర సాయం ఆధారంతో నిలిచి ప్రమాదకరంగా ఉన్న చెట్టు



బ్యాంక్‌కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న చెట్టు కొమ్మలు

మోతీనగర్: మూసాపేట, అల్లాపూర్ డివిజన్లలోని పలు కాలనీలలోని ప్రధాన రోడ్డుల్లో భారీ వృక్షాలు ఎండిపోయి ప్రమాదకరంగా మారాయి. అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్ నుంచి బ్యాంక్ కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డులో కొన్నేళ్ల నుంచి చెట్టు కొమ్మలు ఎండిపోయి ప్రమాదకరంగా మారాయి. సమీపంలోనే ఓ పాఠశాల ఉంది. నిత్యం ఆ రహదారిలో రాత్రి, పగలు తేడా లేకుండా వాహనదారులు, పాదచారులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా నివసించే నిర్వాసితులు, వృద్ధులు, చిన్నారులు బయటకు రావాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండిపోయిన చెట్టు కొమ్మలు ఎప్పుడైనా పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది.

◆ ఈ చెట్టు కొమ్మలు విరిగి ఎవరికి ప్రమాదం కలుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటున్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా గాలి వీచినప్పుడు ఈ చెట్టు కొమ్మలు విరిగి వైర్లపై పడితే పెను ప్రమాదం సంభవిస్తుందని ఆందోళన చెందుతున్నారు. ప్రతి సోమవారం ఆ ప్రాంతంలో కూరగాయల సంత కొనసాగుతుంది. ప్రమాదకరంగా తయారైన చెట్టు కొమ్మల కిందే కూరగాయలు విక్రయిస్తుంటారు. ఈ మాత్రం ఆదమరిచినా పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. చెట్టు వద్దే పాఠశాల ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిత్యం ఆ ప్రాంతంలోనే సంచరిస్తుంటారు.

◆ అదే విధంగా మూసాపేట డివిజన్ బాలాజీ స్వర్ణపురి కాలనీ ప్రధాన రోడ్డులో కూడా ఓ భారీ వృక్షం నేలకొరిగి ప్రమాదకరంగా తయారైంది. ఓ కర్ర సహాయంతో చెట్టు ఆధారపడి ఉంది. ఎప్పుడైనా పడిపోయే ప్రమాదం ఉంది. నిత్యం చిరు వ్యాపారులు ఆ చెట్టు కిందనే నీడ ఉండటంతో తమ వ్యాపారాన్ని కొనసాగిస్తుంటారు. ఇప్పటికైనా రెండు డివిజన్‌లలో పలు కాలనీల్లో ప్రమాదకరంగా ఉన్నటువంటి చెట్టు కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కొమ్మలను తొలగించాలి..



ప్రమాదకరంగా తయారైన చెట్టు కొమ్మలను తొలగించకపోవటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నాం. అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్ నుంచి బ్యాంక్ కాలనీకి వెళ్లే ఓ ప్రధాన రోడ్డులో ఓ భారీ వృక్షం కొమ్మలు ఎండిపోయి ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. పలుమార్లు ప్రమాదకరంగా తయారైన చెట్టు కొమ్మలను తొలగించాలని సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించాలి.

– డొలానగర్ సోనీ, శ్రీ వివేకానందనగర్

దృష్టికి వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతాం

- కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు
- హస్మత్‌పేటలో రెండో రోజు గడప గడపకు బీజేపీ



హస్మత్‌పేటలో గడపగడపకు బీజేపీ పాదయాత్రలో నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో నిర్వహిస్తున్న గడప గడపకు బీజేపీ పాదయాత్ర గురువారం హస్మత్‌పేటలో కొనసాగింది. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు మాట్లాడుతూ.. సుపరిపాలన అందించడంలో బీజేపీకి మించిన పార్టీ ఏదీ లేదన్నారు. ప్రజలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బలపడాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

పీహెచ్‌సీని మోడల్ మార్కెట్ భవనంలోకి మార్చాలి...

అద్దె ఇంట్లో కొనసాగుతున్న పీహెచ్‌సీని మోడల్ మార్కెట్‌లోకి మార్చాలని డిమాండ్ చేశారు. నిత్యం వందలాది మంది వచ్చే ఆరోగ్య కేంద్రంలో కూర్చోవడానికి స్థలం లేదన్నారు. రోగులు, రోగుల సహాయకులను దృష్టిలో పెట్టుకుని వెంటనే మోడల్ మార్కెట్‌లోకి మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, ఎనుగుల తిరుపతి, కన్నె ప్రకాశ్, నాయకులు శ్రీకర్‌రావు, రవి కుమార్, ధర్మ, జగదీష్, వేణుగోపాల్, చింటు వర్మ, వినయ్, బాలాకుమార్, సత్యమూర్తి, బల్వీర్‌సింగ్, చిన్న కశ్యప్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

రామారావునగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ రామారావునగర్ కాలనీలో రూ.10లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ నిర్మిస్తున్నారు. గురువారం ఈ పనులకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావులతో ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రామారావు నగర్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీహాలు నిర్మాణం కోసం ఎమ్మెల్యే సీడీపీ ఫండ్స్ 10 లక్షల రూపాయల నిధులను మంజూరు చేశామన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అడిగిన వెంటనే కమ్యూనిటీహాల్ నిర్మాణానికి నిధులు కేటాయించి సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రంగారావు, డివిజన్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, లక్ష్మీనారాయణ, గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, ఎండీ ఇబ్రహీం, రాజు, సత్యశేఖర్, సత్తయ్య, కొండల్‌రావు, నారాయణ పాల్గొన్నారు.

సమన్వయంతో విజయవంతం చేద్దాం

కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో జరిగే వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను మేడ్చల్ – జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి గురువారం సాయంత్రం పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా పాటించాల్సిన ప్రొటోకాల్, స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన అలంకరణ, మంత్రితో పాటు కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కూర్చునే సభావేదిక వద్ద ఏర్పాట్లు, అవార్డులు తదితర వాటిని క్షుణ్ణంగా ఆయన పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మంత్రి మల్లారెడ్డి ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకొని జాతీయ పతాకావిష్కరణ మొదలుకొని తిరిగి వెళ్లే వరకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వేడుకలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో ఉంటూ వారికి కేటాయించిన విధులను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసమూర్తి, ఏసీపీ రామలింగరాజు, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్రావు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

నేడు కీసర అమరవీరుల స్మారకచిహ్నం వద్ద శ్రద్ధాంజలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు జిల్లావ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం నుంచి 22 వరకు ఇరవై ఒక్క రోజులు వైభవంగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేసి, అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌ను రంగు రంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఈ నెల 2న ఉదయం 8.20 గంటలకు కీసర చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం వద్ద అమరవీరులకు మంత్రి మల్లారెడ్డి శ్రద్ధాంజలి ఘటిస్తారని తెలిపారు. అనంతరం తూముకుంట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ ప్రాంగణం ఆవరణలో ఉదయం 9 గంటలకు మంత్రి మల్లారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, దశాబ్ది ఉత్సవ సందేశం, అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు.

యువతి అదృశ్యం



సంధ్యకుమారి (ఫైల్)

బాలానగర్: బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన ఓ యువతి తిరిగి ఇంటికి రాని సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. బెంగాల్‌కు చెందిన ముకుంద్ జా తన కుటుంబీకులతో పంచశీల కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతని కూతురు సంధ్య కుమారి (17) 31వ తేదీ సాయంత్రం ఇంటి పక్కనే గల మేనత్త ఇంటికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన సంధ్యకుమారి తిరిగి ఇంటికి రాలేదు. దాంతో ఆందోళనకు గురై బంధువులు, స్నేహితులు ఇళ్లల్లో గాలించినప్పటికి ఆచూకీ లభ్యం కాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 4న సూర్యాపేటలో జరిగే తెలంగాణ జన సమితి (టీజేఎస్) 3వ ప్లీనరీని విజయవంతం చేయాలని టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ప్లీనరీ విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగేష్, నరేందర్, కృష్ణ, రాము, బాలు, సతీష్, కిరణ్, అక్షయ్, ప్రవీణ, రేణుకా, అనిత, సురేందర్ పాల్గొన్నారు.

నియామకం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వ్యాయామ విద్య (ఫిజికల్ ఎడ్యుకేషన్) ఫ్యాకల్టీ డీన్‌గా సీనియర్ అధ్యాపకులు ప్రొ.రాజేష్‌కుమార్ నియమితులయ్యారు. గతంలో వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపల్, హెడ్, బీవోఎస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా పదవులు చేపట్టిన ప్రొ.రాజేష్‌కుమార్ డీన్‌గా నియమితులవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

ఫీజులు తగ్గించే వరకూ పోరాడతాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం పాలక మండలి సమావేశం జరుగుతుండగా పీహెచ్‌డీ ఫీజుల పెంపు అంశాన్ని చర్చించేందుకు కార్యాలయంలోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకొని పీఎస్‌కు తరలించారు. ఫీజులు పెంచి పేద విద్యార్థులను చదువులకు దూరం చేయలేరని పోలీస్ స్టేషన్లలో పుస్తకాలు చదువుతూ నిరసన తెలిపారు. పెంచిన ఫీజును తగ్గించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి



బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని రంగారెడ్డి నగర్ రోడ్ నం.9లో ఓ గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకొని మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. రోడ్ నం.9లో క్రేన్స్ నిలిపే ఓ వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వెళ్లి చూడగా చెట్టుకు చీరతో ఓ వ్యక్తి ఉరేసుకొని చనిపోయి ఉన్నాడు. చుట్టు పక్కల విచారించగా అతని ఆచూకీ తెలవలేదు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. రక్త సంబంధికులు ఎవరైనా ఉంటే బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయి

శాసనమండలి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



కుత్బుల్లాపూర్: ప్రతిపక్షాలు అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నాయని... గడచిన తొమ్మిది సంవత్సరాల కాలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ పేరు ప్రఖ్యాతలు దేశం మొత్తం వినిపిస్తున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కొమరం భీమ్ – ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జ్‌గా జూన్ 2వ తేదీన జరిగే తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న శంభీపూర్ రాజు గురువారం ‘సాక్షి’తో మాట్లాడారు. ఈనెల 2 తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగే ఉత్సవాలపై ప్రతిపక్ష నాయకులు రాజకీయం చేయడం తగదన్నారు. దీనిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. శరవేగంతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రతిపక్షాలకు మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని... ఈ నేపథ్యంలోనే ఉత్సవాలపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని... దీనిని బీఆర్ఎస్ కార్యకర్తలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే దిశగా ముందుకు సాగుతామన్నారు. అన్ని నగరాలను విశ్వ నగరాలుగా తీర్చిదిద్దే దిశగా భారీ ఫ్లైఓవర్లు, స్కై వేలు, అండర్ పాస్‌లు, బ్రిడ్జిలు, చెరువులు, నాలాల ఆధునీకరణ పనులపై దృష్టి సారిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిచి తప్పకుండా ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి తీసుకురావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

5న ప్లాస్టిక్ కాలుష్యంపై సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 5న ఓయూ దూరవిద్య కేంద్రంలో జాతీయ సదస్సు జరగనుంది. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కాలుష్యం పరిష్కారం అనే అంశం పై జరిగే జాతీయ సదస్సు వాల్‌పోస్టర్‌ను గురువారం వీసీ రవీందర్, రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, పబ్లిక్ పాలసీ ఎక్స్‌పర్ట్ డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి వక్తలుగా పాల్గొని ప్రసంగిస్తారని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ నవీన్ తెలిపారు.

వార్డు కార్యాలయం పునర్ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: శంషీగూడలోని జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో జరుగుతున్న పునర్ నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 8లక్షల రూపాయలతో వార్డు కార్యాలయం పనులను చేపట్టామన్నారు. కార్యాలయంలో ఫ్లోరింగ్, గోడలకు ప్యాచ్ వర్క్, మరుగుదొడ్ల నిర్మాణం, పెయింటింగ్ వంటి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో చిన్నోళ్ల శ్రీనివాస్, పోశెట్టి గౌడ్, వెంకటేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కేపీహెచ్‌బీకాలనీ: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లాకు చెందిన సి.హెచ్. వరప్రసాద్‌రెడ్డి, భాను ప్రియాంక భార్యాభర్తలు. వీరు కేపీహెచ్‌బీ కాలనీలోని రమ్యాగ్రౌండ్స్ సమీపంలోని ఎల్‌ఐజీ గృహంలో నివాసముంటున్నారు. వరప్రసాద్‌రెడ్డి స్థానికంగా క్రికెట్ పాయింట్ నిర్వహిస్తుండగా భాను ప్రియాంక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొంత కాలంగా క్రికెట్ పాయింట్ నిర్వహణలో నష్టాలు రావటంతో ఆర్థికంగా అప్పుల ఊబిలో చిక్కుకున్నాడు.

◆ గురువారం భాను ప్రియాంక డ్యూటీకి వెళ్లటంతో వరప్రసాద్ రెడ్డి ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. మధ్యాహ్నం 12 గంటలకు వరప్రసాద్‌రెడ్డి ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లుగా స్థానికులు భాను ప్రియాంకకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఆమె వెంటనే ఇంటికి వచ్చి చూడగా వరప్రసాద్‌రెడ్డి సీలింగ్‌ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. విషయాన్ని కేపీహెచ్‌బీ పోలీసులకు తెలపటంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వరప్రసాద్ రెడ్డి ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని భానుప్రియ పోలీసులకు తెలిపింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తున్నాం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- ఇంద్రానగర్‌లో పర్యటన
- నేరుగా సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే



ఇంద్రానగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్: ఇంద్రానగర్ కాలనీవాసుల సమస్యలను అన్నింటిని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి ఇంద్రానగర్‌లో పర్యటించారు. కాలనీవాసులు పలువురు తమ ఇళ్లలో సరిగ్గా తాగునీరు రావటం లేదని ఫిర్యాదు చేశారు. అక్కడే వెంటనే జలమండలి అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వాటర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మిస్తున్నట్లు మహిళలకు తెలిపారు. రోడ్లు నిర్మించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని మరి కొందరు తెలపటంతో రోడ్ల నిర్మాణానికి ఎస్టీ మెషర్స్ సిద్ధం చేయాలని అధికారులకు చెబుతూ రోడ్ల నిర్మాణం చేస్తామని తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు అన్ని కల్పిస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలు నెరవేరుస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్నామని అన్నారు. వితంతు, వృద్ధాప్య, వికలాంగ పెన్షన్లు మంజూరు చేస్తామన్నారు. బస్తీవాసుల సంక్షేమానికి ఎప్పుడు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోపు వెంకటరెడ్డి, కుమార్, వెంకటేష్, అధికారులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

18మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు



కూకట్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన రూ.11.09 లక్షల విలువల చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను 18మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గతంలో సీఎంఆర్ఎఫ్ కింద లబ్ధి పొందాలంటే ఏళ్ల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న వెంటనే లబ్ధి చేకూరుతోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేదలకు అండగా ఉంటూ ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తున్నారని తెలిపారు.